# దొడ్డమనసు

-గుమ్మా నిత్యకళ్యాణమ్మ

పేపరు చదువుతున్న పద్మనాభరావు ఉన్నపాటున పేపరు మడిచి వంటింటి వేపు వెళ్లాడు.

వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణం చెయ్యవలసి వచ్చినా మొదటి అడుగుతోనే మొదలుపెట్టాలి. మెల్ల మెల్లగా నడిచే చీమలు కొంత కాలానికి సముద్రాన్ని దాటగలవు. గరుత్మంతుడైనా సరే ఉన్నచోటు నుంచి కదలడానికి బద్ధకిస్తే అసలు ముందుకు వెళ్ళలేడు. మానవ ప్రయత్నం లేనిదే పనులు జరగవు.

ఊత కర్రల శబ్దం విన్న శాంత ఈవేళప్పుడు భర్త వంటింటిలోనికి ఎందుకు వస్తున్నాడో అర్థంకాక చేస్తున్న పూజను ఆపి వెనుతిరిగి చూసింది.

"నీ పూజ ఇంకా పూర్తికాలేదా? టిఫిను భోజనాల వేళకేనా?" అన్నాడు భార్యతో.

"అదేమిటి, ఈ పూట పేపర్లో ఏ వార్తలు లేవా? మీరు పేపరు ఆసాంతం చదివేసరికి ఒక గంట పడు తుందని టిఫిన్ ఇంకా చెయ్యలేదు. ఉండండి, అన్నీ సిద్ధంగా ఉన్నాయి, చిటికెలో చేస్తాను" అంది శాంత.

"టైములేదు. నేను నింపాదిగా వెళ్తే అవతలి వ్యక్తి దొరకడు. ఇప్పటికే చాలా ఆలస్యం చేశాం" అన్నాడు పద్మనాభరావు.

"ఆలస్యం చేశావంటూ నన్నూ కలుపుతున్నారు. అంత అర్జంటు రాచకార్యం ఏమిటో?" అంది శాంత.

"గాలిలో దీపం ఉంచి దేముడా నీదే భారం అంటే ఆ దీపం ఆరకుండా వుండదు. మనం అడుగు ముందుకు వేస్తేనే కాని గమ్యం చేరలేము."

"మన దీపం ఎప్పుడో ఆరిపోయింది" శాంత దుఃఖంతో కళ్ళు తుడుచుకుంది.

ఆమెను సముదాయించడానికి విషయాలు వివరంగా చెప్పడానికి అతనికి టైములేదు.

విషయం అర్థంకాక బయటకు వెళ్ళిపోతున్న భర్తను చూస్తూ గుమ్మంలో నిల్చుండిపోయింది శాంత.

❖ ❖ ❖

పద్మనాభరావు ఒక ప్రయివేటు కంపెనీలో మెకానిక్కుగా పనిచేసేవాడు. మూడేళ్ళ క్రితం యాక్సిడెంటులో ఒక కాలు పోయింది. ఉద్యోగానికి అనర్హుడని అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించారు. నామమాత్రం కాంపెన్సేషను ఇచ్చారు. ఆ డబ్బు బ్యాంకులో వేసి వచ్చిన డబ్బుతో కాలక్షేపం చేస్తున్నారు. శాంత కుట్టు మిషను మీద బట్టలు కుట్టి కొంత సంపాదిస్తున్నది.

వారికి చలపతి అనే కొడుకు ఉన్నాడు. పద్మనాభరావుకి యాక్సిడెంటు అయిన రెండేళ్ళకు చలపతికి ఉద్యోగం దొరికింది. చలపతి ఆర్జన కారణంగా వారి స్థితి మెరుగైంది. చలపతి కోసం సంబంధాలు వస్తున్నాయి. నిర్మల వారికి నచ్చింది. నిర్మల తండ్రిది విశాఖపట్నం. కట్న కానుకలు ఇచ్చే స్థితిలో వారు లేరు. పేద ఇంటి పిల్ల కోడలైతే ఆ పిల్ల అణిగి మణిగి వుంటుందని శాంత ఆ సంబంధానికి ఇష్టపడింది. పిల్ల నెమ్మదస్తురాలే అన్న భావం వారికి కలిగింది.

పెళ్లి అయిన ఏడాదికే చలపతి ట్రాన్స్‌ఫర్ అయింది. పెద్ద పెద్ద గజిటెడ్ ఆఫీసర్లనే ఒకచోట స్థిరంగా నాలుగైదు సంవత్సరాలు ఉండనిస్తారే అలాంటిది గుమస్తాను వారు పనికట్టుకొని ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారో శాంతకు అర్థంకాలేదు. వాడు వెళ్ళిపోతే ఇల్లు గడవడం మళ్లీ కష్టమౌతుంది.

"చలపతీ! మీ డిపార్టుమెంటులో వెంకటేశ్వరరావు గారు నాకు బాగా తెలుసు. నీ ఉద్యోగం అతని కారణంగానే దొరికింది. ఏదో పొరపాటు వలన నిన్ను ట్రాన్స్‌ఫర్ చేసి ఉంటారు. నీవు వూరు విడిచిపోవడం ఎందుకు? నీవు వారం పది రోజులు సెలవు తీసుకో. నేను ఈ రోజే వెళ్ళి వెంకటేశ్వరరావు గారిని కలుస్తాను" అన్నాడు పద్మనాభరావు.

"మామయ్యగారు, ఉద్యోగాలు అన్న తరువాత బదిలీలు తప్పనిసరి. మీ పలుకుబడిని వినియోగించి మీరు ట్రాన్స్‌ఫర్‌ను కేన్సిల్ చేయిస్తారు. అయితే మరో ఆరు నెలల తరువాత మళ్లీ ట్రాన్స్‌ఫర్ చెయ్యరన్న నమ్మకం ఏమిటి? ఇప్పుడైతే వారిని విశాఖపట్నం వేశారు. అక్కడ మా అమ్మా నాన్న ఉంటున్నారు" అంది నిర్మల.

"అది కాదమ్మా! మన కుటుంబం రెండు ముక్కలౌతుంది. ఆర్థిక ఇబ్బందులు సరేసరి. నేను అవిటివాడిని. చీటికి మాటికి మీ అత్తే బజారుకిపోవాలి" అన్నాడు.

"మేం అక్కడ అద్దె ఇంట్లో ఉండవలసిన పనిలేదు. మావాళ్ళ ఇల్లు ఉండనే ఉంది" అంది నిర్మల.

ఈ పిల్లకు ఇక్కడ వుండడం ఇష్టంలేదా అనుకుంది శాంత.

"నాన్నగారు, విశాఖపట్నంలో ఉంటే డిపార్టు మెంటు పరీక్షలకు వెళ్ళే అవకాశాలు మెరుగౌతాయి. డిపార్టుమెంటు పరీక్షలు పాసుకాకపోతే ప్రమోషన్లు ఉండవు."

"ఏమండీ! వాళ్ళు ఇష్టపడి వెళ్ళిపోదాం అనుకుంటే మధ్య మీకెందుకు? ఇన్నాళ్ళూ అమ్మా అమ్మా అంటూ నా కొంగు పట్టుకు తిరిగేవాడు. ప్రయోజకుడయ్యాడు, పెళ్ళాం వచ్చింది. ఇప్పుడు అమ్మ అల్లం పెళ్లాం బెల్లం" అంది శాంత.

పద్మనాభరావు ఏదో చెప్పబోయాడు. "అయ్యో, వాడు ఉద్యోగంలో చేరకముందు మనం పస్తులు న్నామా? నా వంట్లో శక్తి ఉన్నంత వరకు కుట్టుమిషను ఆసరా వుంటుంది. ఆ పిల్లకు తన తల్లిదండ్రుల మీద ఉన్న అపేక్ష మనవాడికి లేదే అన్నదే నా బాధ" అంది శాంత.

"సరేనమ్మా! మీరెక్కడ ఉన్నా క్షేమంగా ఉండా లన్నదే మా కోరిక. ఈ అత్త మామల మీద దయవుంచి వస్తూ పోతూ ఉండండి" అన్నాడు పద్మనాభరావు.

కొడుకు కోడలు వెళ్లిపోయిన తరువాత ఆ ఇల్లు చిన్నబోయింది.

❖ ❖ ❖

కొన్ని నిజాలు దాచినా దాగవు.

కాకతాళీయంగా ఒక స్నేహితుని ఇంట్లో వెంకటేశ్వరరావు కనిపించాడు. కుశల ప్రశ్నల అనం తరం అతను చలపతి ట్రాన్స్‌ఫర్ విషయం ఎత్తాడు.

"పద్మనాభం! అనుకోకుండా ఒకరోజు మీ చలపతి మా ఇంటికి వచ్చాడు. నువ్వు ఇయ్యమన్నావని చెప్పి నాకు ఒక ఉత్తరం ఇచ్చాడు. అది చదివి నేను ఆశ్చర్య పోయాను. నీ కొడుకుని విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ చేయించమని ఎందుకు రాసేవు? మీ కోడలితో పడలేదా? ఆ పిల్లతో కలిసి ఉండడం మీకు ఇబ్బందిగా ఉందా?"

వెంకటేశ్వరరావు అలా అడిగితే పద్మనాభరావు దిగ్భ్రాంతి చెందాడు. తను వాడికి ఉత్తరం రాయడ మేమిటి? చలపతి దొంగ ఉత్తరాన్ని సృష్టించి కావాలని తన ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడా? అందుకు నిర్మల ప్రేరణ వుందా? నిర్మల తమలో కలసిపోయిందని భావిస్తూనే వచ్చారు. ఎలాంటి తగవులు లేవే? నేను నీకే ఉత్తరం రాయలేదు. అది దొంగ ఉత్తరం. మా చలపతి కావాలని చేసింది అని నిజం చెప్తే వెంకటేశ్వర రావుకి జుగుప్స కలగదా వాడిమీద. దాని పర్యవసా నాలు ఎటు దారితీస్తాయో? జరిగిందేదో జరిగి పోయింది. ఇప్పుడు ఇంటి గుట్టు రచ్చకీడ్చి ప్రయోజ నం లేదు అనుకున్నాడు.

"అదా! మా కోడలికి ఈ ఊరి నీళ్ళు పడలేదు. ఎప్పుడుపడితే అప్పుడు అనారోగ్యంతో మంచమెక్కేది. చీటికి మాటికి పుట్టింటికి వెళ్ళేది. ఇక రెండో కారణం విశాఖపట్నంలో అయితే డిపార్టుమెంటు రూల్సు బాగా తెలుస్తాయి. పరీక్షలు రాస్తాడు. ప్రమోషన్లు వస్తాయి. అందుకనే నేనా ఉత్తరం రాశాను" అన్నాడు పద్మనాభ రావు.

ఈ విషయం శాంతకు తెలిస్తే ఆమె రాద్ధాంతం చేస్తుందని పద్మనాభరావు భార్యకు చెప్పలేదు.

❖ ❖ ❖

కాలం అంతా ఒక్కలాగుండదు.

మనిషి ఏదో చెయ్యాలనుకుంటాడు. అందుకు ప్రతికూలంగా దైవ నిర్ణయం ఉంటుంది.

నిర్మల మనస్తత్వం పద్మనాభరావుకి పూర్తిగా అవ గతమైంది. తమను ఆమె ఉపేక్షా భావంతోనే చూసింది.

## సబ్బని నానీలు

డబ్బు అంటే మహా ప్రేమ కదా!
తృప్తికి మించిన ధనముందా?
'స్వామి' అని అంటుంటే
'స్వామ్' అని వినిపిస్తుంది అయ్యో రామా!
వాదం ఏదైతేం? మానవతా వాదానికి
మించిందా? బతుకు పునాది కావాలి
శుద్ధి అంటూ దేహాన్ని శుద్ధి చేస్తున్నారు
మరి మనసును శుద్ధి చేయరా?
అంటరానితనం కులంలోనేనా?
సాహితీ కులంలోనూ ఉంది.
తెర తీయగరాదా?
క్యూ కడుతున్నారు జనం సినీమాయలో.
జీవించాలంటే నటించాలా?
బతుకులో క్షణక్షణం నటనే!
కుక్క తోక మాత్రమే వంకరా?
మరి మనిషి నైజమూ వంకరే.

–సబ్బని లక్ష్మీనారాయణ

స్వంత మనుషుల్లా ఆమె తమను చూడలేదు. అయినా ఆమె కోసం అతడి మనసు వ్యాకులత చెందుతూనే ఉంది.

"రావయ్యా! పద్మనాభం, ఆ విషయం తెలియగానే నా హృదయం ద్రవించుకుపోయింది. ఎలా జరిగింది?" అన్నాడు విశ్వేశ్వరరావు.

"అంతా దైవలీల. మా భాగ్యంలో అలా రాసి వుంది. వాడి వయసనగా ఎంత? నిండా ఇరవై అయిదేళ్ళు లేవు. అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయి. వాడి భార్య నిర్మలను చూస్తే మా కడుపు తరుక్కుపోతోంది. భార్య భర్తలిద్దరూ ఎటో వెళ్ళి ఆటోలో తిరిగి వస్తుంటో ఆటో బోల్తా పడింది. నిర్మలకు చిన్న దెబ్బ తగలలేదు. ఆటో డ్రైవరుకి ఏమీ కాలేదు. మా చలపతి మాత్రం అక్కడికక్కడే చచ్చిపోయాడు. ఇంతవరకు చలపతి సంపాదన మీద బ్రతుకుతున్న నిర్మల తల్లిదండ్రులకు వారి పిల్లే భారమైంది. నేను ఆమెను ఓదార్చి ఇంటికి తీసుకువచ్చాను" అన్నాడు పద్మనాభరావు.

## ఎసకము

**తూ**ర్పు యెత్తినది తొంగలి రెప్పా
కూర్పులల్లినది కోకనదమ్మా
నేర్పు నేరుముల నెయ్యమిదంతా
ఊర్పు సందడుల ఊయలమేళా-
పాట నాట నెద పయ్యెదపై - ఓ
తేటి వాలుటకు తూలుచు రాగా
తోట దారి విరి తోరణలందూ
మాట కందువగ మర్మము తోచెన్-
ఆట పాటలవి అమ్మక చెల్లా
రాటము తిరిగే రంగుల పూలా
పాట పల్లవికి పాదములెన్నో
ఏటి చాలు నొక ఏతము సాగెన్-
పూల గుండెలకు పుప్పొడి మోతై
గాలి వీచులకు గజ్జెల మ్రోతై
రేల దారిబడి రేగినదా- ఈ
ఓలలాడు చికిలింతల దొంతీ-
మాట మాట కొక మాలిమి తోడై
పూట పూటకొక పోడిమి దూడై
బోటి వైనలలి పోకడలెన్నో
బాటసారి కను పాపల పోల్చన్-

-సాంధ్యశ్రీ

"అంతా స్వార్థమయం. ఇంక మానవ సంబంధాలు, అనుబంధాలు, అపేక్షలు ఎక్కడ వున్నాయి?"

"విశ్వా! నువ్వు నాకో ఉపకారం చెయ్యాలి. ఈ పని నీ వల్లనే అవుతుంది" అన్నాడు పద్మనాభరావు.

"పద్మనాభం! సంకోచం ఎందుకు? నీవు చెప్పిన పని నేను చేయనన్న అనుమానం నీకుందా?"

"ఈ రోజు పేపర్లో ఒక వార్త చూశాను. నువ్వు గుర్తుకొచ్చావు."

"పేపర్లో వార్త చూసి నేను గుర్తుకొచ్చానా? భలే విచిత్రంగా ఉందే. నేను నాలుగు పేపర్ల చూశాను. అందులో నాకు సంబంధించినది ఏమీలేదే?"

"కాళహస్తి సమీపంలో ఒక లారీ జీపు ఢీకొని పదముగ్గురు మరణించారట. చనిపోయిన వారి కుటుంబాలకు చెరో మూడు లక్షల రూపాయలు, ప్రతీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ముఖ్య మంత్రి గారు ప్రకటించారు."

"అదా నిన్ను ఆకర్షించిన వార్త. అలాంటి వార్తలు రాని రోజంటూ ఉంటుందా?"

"మా చలపతి కూడా రోడ్డు ప్రమాదంలోనే చనిపోయాడు. మరి మాకు అలాంటి సహాయం అందవలసిన అవసరం లేదా? నీవు నాకు సహాయం చేస్తావన్న నమ్మకంతో వచ్చాను" అన్నాడు పద్మనాభరావు.

విశ్వేశ్వరరావు అసమంజస స్థితిలో పడ్డాడు. తుపాను బాధితులకు, భూకంపాల్లో మరణించిన వారి ఆశ్రితులకు, అలాగే రైలు రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. అందులో కొన్ని నోటి మాటలౌతాయి. కొందరికి ప్రకటించినంత కాకపోయినా కొద్దో గొప్పో దొరుకుతుంది. కాని ఇలా అరకొర వ్యక్తులు చనిపోతే ప్రభుత్వాలు స్పందించవు.

"విశ్వా! ఏమిటాలోచిస్తున్నావు? ఇది నీ వల్ల కాదంటావా? నీ మీద ఎంతో ఆశతో వచ్చాను."

"పద్మనాభం! నీ కోడలి నైజం ఎరిగి వుండి ఆమెకు సహాయం చేయాలని ఎందుకు ఆరాటపడతావు? నీ కోడలిది ఏరుదాటి తెప్ప తగలేసే రకం అని నీకు తెలియదా? దీనివలన నీకు ఒరిగేది ఏమిటి?"

"ఆమె మా పట్ల ఎలా వ్యవహరించినా మా పంచ చేరింది. భర్తను పోగొట్టుకుంది. రెండు పదుల వయసుది. మా తదనంతరమైనా ఆమెకు ఒక జీవిక కావాలిగా?"

"నిజమే, నీ కొడుకులా చనిపోయినవారు వందల

మీద ఉంటారు. వీరందరిని ఏ ప్రభుత్వమూ ఆదుకో లేదు. పద్మనాభం నువ్వు నామీద నమ్మకంతో వచ్చావు. ఏనాడు నువ్వు నన్నేదీ కోరలేదు. ప్రయత్నిస్తాను."

"విశ్వూ! ప్రయత్నిస్తాను అంటే కుదరదు. సాధి స్తాను అని మాట ఇవ్వు."

విశ్వేశ్వరరావు అప్పటికప్పుడే పద్మనాభరావు చేత అప్లికేషను రాయించాడు. చలపతి మరణానికి సంబం ధించిన డాక్యుమెంట్ల ఫోటోకాపీలు తీయించాడు. "వారం పదిరోజుల్లో పండో కాయో చెప్తాను. ఒకవేళ పని కాలేదనుకో నువ్వు నన్నర్థం చేసుకోవాలి."

"నువ్వు తలచుకుంటే అది పండే ఔతుంది."

❖ ❖ ❖

"ఏమండీ! ఏ పనిమీద వెళ్ళారో నాకు మాట మాత్రం చెప్పలేదు. నేను అడ్డు వస్తాననా?" అంది శాంత.

పద్మనాభరావు జరిగిందంతా చెప్పాడు.

"మీ కోడలి నైజం తెలిసి కూడా ఆమెకు సహాయం చేయాలన్న ఉదార భావం మీలాంటి వారికే ఉం టుంది" అంది శాంత.

"విశ్వు కూడా అదే మాట అన్నాడు. నిర్మలను మనం ఎంత కాలం పోషించగలం. రోజూ ఒక చేప ఇస్తే ఆ మనిషి బ్రతుకుతాడు. అయితే చేపలు పట్టే విద్య నేర్పిస్తే వాడు తన కాళ్ళమీద నిలబడగలడని ఒక సామెత ఉంది" అన్నాడు పద్మనాభరావు.

ఆమె ఉద్యోగస్తురాలు అయితే చలపతి లేని లోటు ఆమె పూరిస్తుందన్నది పద్మనాభరావు విశ్వాసం.

వారం తిరగకుండానే విశ్వేశ్వరరావు పద్మనాభ రావు ఇంటికి వచ్చాడు. అతను ఏ సందేశం తెచ్చాడో అది పద్మనాభరావు ఊహకందనిది కాదు. అయితే ఇంత తక్కువ వ్యవధిలో పని జరుగుతుందని అతను ఊహించలేదు.

"పద్మనాభం! మీ కోడలినొకమారు పిలుస్తావా?" అన్నాడు. ఇంతలో శాంత వచ్చింది. "ఏం అన్నయ్యా ఇంత కాలానికి మేం గుర్తుకు వచ్చామా?" అంది.

"నిజమే! చలపతి చనిపోయాడన్న వార్త విన్నా రాలేకపోయాను. ఒక్క క్షణం తీరిక వుండదు."

"నమస్కారం!" అంది నిర్మల. భర్త పోయిన విచా రం ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

"అమ్మాయి నిర్మలా! నీ భర్త పోయినందుకు విచారిస్తున్నాను. అయితే ఈరోజు నీకొక సంతోషకర మైన వార్త చెప్పాలని వచ్చాను."

"సంతోషకరమైన వార్తా! అది నా భాగ్యంలో లేదే?"

"అంత నిరాశ పనికిరాదు. దైవ నిర్ణయానికి అందరూ తల ఒగ్గవలసినదే. నీ భర్త పనిచేసిన ఆఫీసు లోనే నీకు ఉద్యోగం ఇచ్చింది ప్రభుత్వం. పైగా రెండు లక్షల ఆర్థిక సహాయం కూడా అందజేస్తోంది. నీవు విశాఖపట్నం వెళ్లి కలెక్టరు గారిని కలుసుకో. కొన్నాళ్ళు పోయిన తరువాత నిన్ను ఈ వూరికి బదిలీ చేయి స్తాను."

విశ్వేశ్వరరావు సంబంధిత కాగితాలు పద్మనాభం చేతుల్లో పెట్టాడు.

"విశ్వూ! నీవీ సహాయం చేస్తావన్న పూర్తి నమ్మకం నాకుంది. మా నిర్మలకు ఒక దారి చూపించిన నీ మేలు జన్మలో మరువలేనిది."

"నిర్మలా! మీ మామ గారి మాట కాదనే ధైర్యం నాకు లేదు. నేనీనాడీ స్థితిలో వున్నానంటే అది మీ మామగారు పెట్టిన బిక్షే. ఇక మీదట నీ అత్త మామ లను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత నీది" అన్నాడు విశ్వేశ్వరరావు.

"మీకెలా ధన్యవాదాలు చెప్పాలో నాకు మాటలు రావడంలేదు" అంది నిర్మల.

❖ ❖ ❖

ఉద్యోగంలో చేరిన తరువాత మొదటి నెల జీతం అందుకొని, నిర్మల అత్తవారింటికి వచ్చి సగం జీతం మామగారికిచ్చింది. శాంత ఆనందానికి అవధుల్లేవు. రెండు లక్షలు అందుకున్న నిర్మల కొంతైనా ఇవ్వనందుకు బాధపడింది. రెండో నెలా మూడో నెలా కూడా ఇచ్చి జీతంలో సగం డబ్బు ఇచ్చింది.

"ఏమండీ! ఈనెల నిర్మల ఏ కారణం చేత రాలేదో?" అడిగింది శాంత.

పద్మనాభరావుకి మాత్రం ఏం తెలుసు?

"సెలవు దొరికి వుండదేమో? లేక ఆ డబ్బు ఇతరత్రా ఖర్చు చేసి వుంటుంది. ఒట్టి చేతులతో రావ డానికి ముఖం చెల్లక రాలేదేమో?" అన్నాడు.

అయితే మరో రెండు నెలలు గడిచాయి. నిర్మల రాని కారణం అర్థంకాలేదు. డబ్బు ఇవ్వడం ఇష్టం లేకపోతేం, చూసిపోవచ్చును కదా?

"నాకు ఏదో అనుమానంగా ఉంది. మనం వెళ్ళి చూసివద్దామంటారా?" అడిగింది శాంత భర్తను.

భార్య చెప్పినది సబబుగానే ఉంది. నిర్మల రాక పోవడానికి కారణం తెలుసుకోవలసిన బాధ్యత

తమకుంది అనుకున్నాడు.

❖ ❖ ❖

నిర్మలను చూడాలని వెళ్ళినవాళ్ళు అదేరోజున తిరిగి వచ్చారు.

"ఏమండీ! ఇప్పుడు సంతోషించాలంటారా, ఏడవాలంటారా? నాకేమీ అర్థం కావడంలేదు" అంది శాంత.

"శాంతా! మన చలపతి చనిపోయినప్పుడే మన కన్నీళ్ళన్నీ హరించుకుపోయాయి. ఇంకా ఏడ్వాలన్నా కన్నీళ్ళు లేవే?" స్త్రీ కాబట్టి శాంత రోదిస్తున్నది. మగాడు కాబట్టి దుఃఖాన్ని దిగమ్రింగి ధైర్యంగా ఉన్నాడు పద్మనాభరావు.

"నేను పెంచి పోషించిన కొడుకు అర్ధాయుష్కుడై రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వాడు మాకు తిండి పెట్టి పోషించేవాడు. నేను ఏ పనీ చేయలేని కుంటివాడిని. నాకు ఆర్థిక సహాయం అవసరం అని మీరు కాగితం రాసి ఇచ్చి వుంటే రెండు లక్షలు కాక పోయినా ప్రభుత్వం ఎంతో కొంత ధనం ఇచ్చి వుండేది నా కోడలు అంటూ మీరు కోడలికి సహాయం కావాలని దేవులాడేరు. ఆ పిల్ల మిమ్మల్ని కష్టాలలో ఆదుకుం టుందని ఆశపడ్డారు. చివరికేమైంది?" అంది శాంత.

"శాంతా! నువ్వన్నది కాదని త్రోసిపుచ్చలేను. చనిపోయిన నా కొడుక్కి ఉత్తరాధికారి నా కోడలే. చెట్టంత కొడుకే పోయినప్పుడు ఆ పాపిష్టి డబ్బు నాకెందుకు? అభం శుభం తెలియని పిల్ల. అందుకే ఆమెను ఆదుకోవాలనుకున్నాను. విశ్వేశ్వరరావు రూపంలో దేముడు నన్ను కరుణించాడు."

"కాని ఆ నిర్మల మీరు చేసిన మహోపకారానికి ఎలాంటి గుర్తింపునిచ్చింది. నిజం చెప్పాలంటే ఆమె మీకు ద్రోహం చేసింది."

"శాంతా! ఆమె చేసింది ద్రోహం అనుకోను. ఎవ్వరైనా వారి బాగు ముందు చూసుకుంటారు. అయితే ఆమె చేసినది తప్పిదమే. ఆమె తను పునర్వివాహం చేసుకుంటున్నాను అని చెప్పి వుండవలసింది. వసంత ఋతువులోనే వృక్షం మాడిపోతే ప్రకృతి సహితం విలపిస్తుంది. శాంతా! ఆమె మరో పెళ్ళి చేసుకోవడం అపరాధం కాదే?"

"అపరాధం కాదా?"

"శాంతా! మాటవరసకు ఆ ప్రమాదంలో నీ కొడుకు బ్రతికి వుండి నీ కోడలే చనిపోతే నీ కొడుక్కి మరో పెళ్ళి చేయవా?"

"మగవాళ్ళకు ఆడవాళ్ళకు సాటా?"

"శాంతా! నిర్మల నీ కూతురే అనుకో. ఆ పిల్ల యవ్వనంలోనే వైధవ్యం అనుభవిస్తూ వుంటే నీ మనసు ఏమంటుంది? అవకాశం లభిస్తే ఆ పిల్లను మరో అయ్య చేతిలో పెట్టడానికి అంగీకరించవా?"

శాంత జవాబు చెప్పలేకపోయింది. తన భర్త స్థానంలో మరొకరుంటే, నిర్మలను రచ్చకీడ్చేవాడు. తమతో మాటమాత్రం చెప్పకుండా మరో పెళ్ళి చేసు కున్న నిర్మలను ఇంకా సమర్థిస్తున్నాడు. ఉభయ భ్రష్టు డైనా నిర్మల చేసిన పనిని హర్షిస్తున్నాడు.

"నాకు ఈ జీవితంలో ఏ లోటూ లేదండి. మీ లాంటి భర్త దొరకడం నిజంగా నా అదృష్టం." కళ్ళు తుడుచుకుంటూ అంది శాంత. ■

## మ్యూర్చ్ నానీలు

సర్కస్‌లో
జంతువులు
సుశిక్షితులైన
సైనికులు!!

శాసన మండలి
ఎన్నికలు!
నమ్మిన బంట్లకే
సీట్లు కానుకలు.

కుల వ్యవస్థ వలన
అవస్థలెన్నో
కుమ్ములాటలు
మత ఘర్షణలు!!

కదిలే కాలం
జీవితం!
ఆగవు ఎవ్వరికోసం
కాలం, కెరటం!!

## హైకూలు

గోదావరికి మణిహారం వంటిది మూడవ బ్రిడ్జి!
వికసించాలి అక్షర కుసుమాలు వీధిబాలల్లో!
విపణివీధి వర్తకులదే రాజ్యం కొంటే కొరివి!
కీటకాలకు సాలెపురుగు గూళ్ళు మృత్యు కౌగిళ్ళు

-ముగడ రామకృష్ణ